క్లుప్తంగా

వైభవంగా విజయదుర్గమ్మ కల్యాణం



మంగళ సూత్రాన్ని చూపుతున్న అర్చకుడు

కడప కల్చరల్: కడప నగరంలోని విజయదుర్గాదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి కల్యాణం వైభవంగా జరిగింది. ప్రతి నెలా రెండో ఆదివారం విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా తొలుత ఆలయ ప్రాంగణంలో వేద పండితులు ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు జరిపారు. స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువు దీర్చారు. అనంతరం కల్యాణం వైభవంగా సాగింది. ఉభయదారులుగా పాల్గొన్న భక్తులు ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు అందజేశారు. ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆకట్టుకున్న వస్త్రధారణ పోటీలు



వస్త్రధారణ పోటీలో పాల్గొన్న చిన్నారులు

కడప కల్చరల్: కడప శిల్పారామం ఆదివారం చిన్నారులతో కళకళలాడింది. ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా ప్రధాన సాంస్కృతిక వేదికపై డ్రీం మీడియా సుజాత బృందం ఆధ్వర్యంలో చిన్నారులకు వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. పలువురు చిన్నారులు వివిధ వేషధారణలతో తల్లిదండ్రులు, సందర్శకులను ఆకట్టుకున్నారు. మెరుగైన ప్రదర్శన ఇచ్చిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. స్థానిక కళాకారులు కామెడీ స్కిట్లు, జానపదాలు, కోలాటాలతో అలరించారు. శిల్పారామం ఇన్‌ఛార్జి పాలనాధికారి శంకర్‌రెడ్డి, ఫీల్డ్ సూపర్‌వైజర్ మధుసూదన్ బాబు పర్యవేక్షించారు.

నేడు సీపీఐ నిరసన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: విద్యుత్తు ఛార్జీలను తగ్గించాలని కోరుతూ కడప ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు సీపీఐ కడప నగర కార్యదర్శి ఎస్.వెంకట శివ పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అదానీతో విద్యుత్తు ఒప్పందాలను రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా నిరసన చేపడుతున్నామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి మేయర్ పరామర్శ



రహీం తల్లి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నగర మేయర్ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు రహీం తల్లి ఆదివారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్ కుమార్, రామకృష్ణారెడ్డి, మల్లికార్జున, రెడ్డిప్రసాద్, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● 26వ డివిజన్ ఇన్‌ఛార్జి త్యాగరాజు చిన్నాన్న పిచ్చయ్య అనారోగ్యంతో మరణించారు. మాసాపేటలోని ఆయన నివాసానికి వెళ్లి మేయర్ సురేష్‌బాబు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు రామలక్ష్మణ్‌రెడ్డి, మల్లికార్జున, యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కడప కార్పొరేషన్: కడప ఈస్ట్, రూరల్ సెక్షన్, పాత కడప సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివ ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్లు, విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్తు కోత ఉంటుందని, ప్రజలు తమకు అన్ని విధాలా సహకరించాలని ఆయన కోరారు.

వల్లూరు: కడపలోని 220 కేవీ సబ్ స్టేషన్‌లో ఏర్పడిన సమస్యల కారణంగా వల్లూరు, చెన్నూరు మండలాల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈలు రామలింగారెడ్డి, డానియల్ జోసెఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు.

14న జాతీయ లోక్ అదాలత్

కమలాపురం: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో ఈ నెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మెజిస్ట్రేట్ లావణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం జూనియర్ సివిల్ కోర్టులో కూడా ఈ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. రాజీకి వీలయ్యే కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు.

టీటీడీ డైరీలకు భలే డిమాండ్

కడప కల్చరల్: తిరుమల వేంకటేశ్వర స్వామి భక్తుల ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్నారు. ఆయన ప్రసాదమే కాదు.. డైరీ, విగ్రహాలు, క్యాలెండర్లు ఇలా ఏవైనా సరే.. ప్రజలు భక్తితో స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేకంగా ఏటా డైరీలు, క్యాలెండర్లు ముద్రిస్తోంది. ఈ ఏడాది ముద్రించిన వాటిని ఇప్పటికే కడప గడప ఆలయానికి చేరాయి.


నూతన సంవత్సరం–2025కు సంబంధించిన టీటీడీ డైరీలు, క్యాలెండర్లు అందుబాటులోకి వచ్చాయి. దేవుని కడప లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రస్తుతం వాటిని విక్రయిస్తున్నారు. దాదాపు నెల రోజుల ముందు నుంచి వీటిని భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. కడప ప్రాంతంలో ఈ డైరీలకు డిమాండ్ ఉండడంతో కడప ఆలయానికి 2000 డైరీలు, అదే సంఖ్యలో క్యాలెండర్లు చేరాయి. శనివారం నుంచే ఆలయ పనివేళల్లో పెద్ద డైరీలు ఒక్కొక్కటి రూ.150, చిన్న డైరీలు రూ.120 చొప్పున విక్రయిస్తున్నారు. స్వామి, అమ్మవార్ల 12 షీట్ల రంగుల క్యాలెండర్ రూ.130, స్వామి ఒక్కరే ఉన్న క్యాలెండర్ రూ.20కి విక్రయిస్తున్నారు.

తొలిసారిగా కడపరాయుని క్యాలెండర్

దేవుని కడప ఆలయం నుంచి ఇంతవరకూ ప్రత్యేక క్యాలెండర్లను ప్రచురించలేదు. తొలిసారిగా 2025 సంవత్సరానికి సంబంధించి కడప రాయుడు లక్ష్మీ వెంకటేశ్వర స్వామితోపాటు అమ్మవారు గల క్యాలెండర్లను టీటీడీ ప్రచురించింది. నెల రోజుల నుంచి వాటి విక్రయాలు కూడా సాగుతున్నాయి. ఇందులో కేవలం స్వామి ఫొటో మాత్రమే ఉన్న క్యాలెండర్ రూ.20, స్వామితో పాటు పద్మావతి అమ్మవారు ఉన్న క్యాలెండర్ ఒక్కొక్కటి రూ.15కు విక్రయిస్తున్నారు. స్వామి ఉభయ దీవేరులతో (శ్రీదేవి భూదేవి లతో కలిసి ముగ్గురుగా) ఉన్న క్యాలెండర్ ఒక్కొక్కటి రూ.15కు లభిస్తోంది. క్యాలెండర్ ముద్రించడం ఇదే తొలిసారి కనుక వాటికి మంచి డిమాండ్ ఏర్పడింది.



టీటీడీ ముద్రించిన కడప రాయుని క్యాలెండర్,



టీటీడీ డైరీ



దేవునికడప ఆలయంలో అన్నప్రసాద వితరణ

అన్నదాన ప్రభువుగా కడప దేవుడు

నిత్యాన్నదాన ప్రసాద క్షేత్రంగా దేవుని కడప లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం విరాజిల్లుతోంది. ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదాత వితరణ చేసేందుకు వేలాది భక్తులు ముందుకు రోజు రోజుకూ ప్రసాదానికి ఆదరణపెరుగుతోంది. ఆలయ నిర్వహకులు భక్తుల వసతిని దృష్టిలో పెట్టుకుని భక్తులకు అన్నప్రసాదం అందజేస్తున్నారు. శనివారం రోజున అన్నదానం చేసేందుకు దాతల సంఖ్య పెరుగుతుండడంతో రెండు నెలలు ముందే తేదీని రిజర్వ్ చేయించుకోవాల్సిన పరిస్థితి. నిర్వాహకులు తమ వంతు సహకారం అందించడంతోపాటు ఆహారంలో నాణ్యత విషయాన్నీ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఎక్కువ రోజులపాటు వేచి చూడలేని భక్తులు ఆలయంలో ఉదయం భక్తులకు అల్పాహారం అందిస్తున్నారు. రోజూ 60 నుంచి దాదాపు వంద మందికి ఈ ప్రసాదం అందజేస్తున్నారు. దీంతోపాటు గత కొన్నేళ్లుగా కడప రాయుడి కోవెలలో తిరుమలేశుని లడ్డూ ప్రసాదాన్ని మొదటి, రెండు శనివారాల్లో అందుబాటులో ఉంచేవారు. ప్రస్తుతం స్వామి లడ్డూ ప్రసాదం ప్రతి రోజూ ఆలయంలో సిద్ధంగా ఉంటోంది.

బీసీల సంక్షేమానికి కృషి చేస్తా



ఎన్నికైన ది బీసీప్రజా చైతన్య సమాఖ్య నూతన కమిటీ

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీల సంక్షేమానికి కృషి చేస్తానని బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని అలంకార్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ది బీసీ ప్రజా చైతన్య సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు తమ పార్టీకి బీసీలే వెన్నముక అని చెబుతూ రాజ్యాధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవడంలేదన్నారు. బీసీలను రాజకీయ నాయకులు ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారేగానీ, వారికి రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నూతన కమిటీ ఎంపిక

ప్రొద్దుటూరు బీసీ ప్రజా చైతన్య సమాఖ్య నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొర్రా రామాంజనేయులు, సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా దేవేంద్రుడు, కోశాధికారిగా మడకా సంటెయ్య, ఉపాధ్యక్షులుగా వేల్పుల భాస్కర్‌యాదవ్, కొత్తపల్లి శ్రీను, సుంకర వేణు, జీసీ పుల్లయ్య, కార్యదర్శిగా భాస్కరరావు, పోసా ఆదినారాయణ, సహాయ కార్యదర్శులుగా తుపాకుల చౌడయ్య, పరమేశ్వరరావు, గౌరవ సలహాదారులుగా గజ్జల చంద్రమౌళి, జయరాం యాదవ్, మల్లిఖార్జున, మునిస్వామి, నాగయ్య, శ్రీనివాసమూర్తి ఆచారితోపాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

వక్ఫ్ ఆస్తులను కాపాడాలి

ప్రొద్దుటూరు క్రైం : వక్ఫ్ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ముస్లింలందరిపై ఉందని ముస్లిం వెల్ఫేర్ అసోసియేసియన్ ప్రెసిడెంట్ ఖాజామొహిద్దీన్ తెలిపారు. స్థానిక ముబారక్ ఫంక్షన్ హాల్‌లో వక్ఫ్ సవరణ బిల్లు–2024పై ఆదివారం చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాజామొహిద్దీన్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయంతో పేద ముస్లింల విద్య, వైద్య, సంక్షేమం తదితర సౌకర్యాలను మెరుగుపరుచుకోవచ్చని చెప్పారు. గెజిట్‌లో చూపబడిన ఆస్తులు వక్ఫ్ బోర్డు ఆధీనంలో లేవని, దేశంలో 70 శాతం ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. బోర్డులో ఇప్పటి వరకు ముస్లిం మహిళలు లేరని, ఇప్పుడు ఇద్దరు మహిళలను నియమిస్తే ఎవరికి మేలు జరుగుతుందని వారు ప్రశ్నించారు. ముస్లిం సోదరులున్న ప్రతి చోట వక్ఫ్ పరిరక్షణ కమిటీలుగా ఏర్పడి ఆస్తులను కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమాల్‌బాషా, ఇర్ఫాన్‌బాషా, ఫరీద్‌బాషా, కుతుబుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ఉద్యమిస్తాం

సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

ప్రొద్దుటూరు : జిల్లా సమగ్రాభివృద్ధికై ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పిలుపునిచ్చారు. మండలంలోని పెన్నానగర్ సీపీఐ కార్యాలయంలో ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు నియోజకవర్గాల సీపీఐ కార్యదర్శులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ జిల్లాలో విస్తారంగా ఖనిజ నిక్షేపాలున్నాయని, పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రత్యక్షంగా 25వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కలుగుతుందన్నారు. జిల్లాలో రోడ్లన్నీ ధ్వంసమై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. అర్ధాంతరంగా ఆగిపోయిన పనులను పూర్తి చేయాలని కోరుతూ పోరాటాలకు సమాయత్తం అవుతామన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు పి.సుబ్బరాయుడు, బి.రామయ్య, శ్రీరాములు, భాస్కర్, చంద్రశేఖర్, హరి, శాఖా కార్యదర్శులు వరత్, ప్రమీల, హృదయానంద్, రామకృష్ణ, ప్రసాద్, యేసోబ్, శివయ్య, బాష, ఏఐఎస్‌ఎఫ్ లీలా కృష్ణ, పీటర్, వాసు, మౌనిష్, దస్తగిరి, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

చామంతి తోట.. రక్షణగా జంట



దూరం నుంచి చూస్తే.. ఎవరో చక్కని జంట పంటను చూడడానికి.. లేదా ఫొటోలు తీసుకోవడానికి పొలంలోకి దిగినట్టుగా అనిపిస్తుంది కదూ.. అలా అయితే పప్పులో కాలేసినట్లే మరి. అది జంట కాదు.. పంటను రక్షించుకోవడానికి ఏర్పాటు చేసిన బొమ్మలని అర్థం చేసుకోవడానికి కొంచెం సమయం పడుతుంది. ఆడ మగ బొమ్మలకు మంచి వస్త్రాలు.. కళ్లద్దాలు అమర్చి ఓ రైతు ఇలా ఆధునికంగా తీర్చిదిద్దారు. అటుగా వెళ్లే వారంతా అవి రైతన్న ఏర్పాటు చేసిన బొమ్మలని తెలుసుకొని ఆశ్చర్యపోతున్నారు. పెండ్లిమర్రి మండలం కేంద్రానికి అతి సమీపంలో కడప మార్గంలో సాగు చేసిన చామంతి పూల తోటలో ఈ జంట అందరినీ ఆకర్షిస్తోంది. – కడప రూరల్

జూదరుల అరెస్టు

పోరుమామిళ్ల : మండలంలోని కవలకుంట్ల హరిజనవాడలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 2,250 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. ఆదివారం విశ్వసనీయంగా తెలిసిన సమాచారంతో దాడి చేసి నిందితులను అరెస్టు చేసి, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

11న సామూహిక పారాయణం

ప్రొద్దుటూరు : శివ దర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక త్యాగరాజరెడ్డి కల్యాణ మండపంలో ఈ నెల 11న సాయంత్రం 5.30 గంటలకు వేయి మందితో భగవద్గీత సామూహిక పారాయణం చేపడుతున్నట్లు ట్రస్టు నిర్వాహకురాలు సరస్వతి మాతాజీ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక శాస్త్రీనగర్‌లోని ట్రస్టు కార్యాలయంలో భగవద్గీత పఠన పోటీలలో విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తామని తెలిపారు.

గంగమ్మకు పూజలు



ప్రత్యేక అలంకారంలో గంగమ్మ తల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మ తల్లిని ఆదివారం వివిధ ప్రదేశాల నుంచి వచ్చిన భక్తులు పూజలు, అభిషేకాలు చేసి దర్శనం చేసుకున్నారు. ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, పూలు, నిమ్మకాయలతో అలంకరించారు. భక్తులు తమ ముడుపులు చెల్లించుకుని, కానుకలు సమర్పించుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేశారు.

నేడు సోలార్ మోడల్ విలేజ్‌పై సమావేశం

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మండలం గోపవరం గ్రామాన్ని సోలార్ మోడల్ విలేజ్‌గా అధికారులు ఎంపిక చేశారు. ఈ విషయంపై సోమవారం ఉదయం 10.30 గంటలకు కొర్రపాడు రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ రమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 5వేల జనాభా కలిగిన గ్రామాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తే కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయలు నజరానాగా ఇవ్వనుందని తెలిపారు.

ఫిబ్రవరి 8న రచయితల మహా సభ



షేక్ హుస్సేన్ దంపతులను సత్కరిస్తున్న సాహితీ వేత్తలు

కడప కల్చరల్ : సాహితీ వైభవాన్ని చాటేలా మహాసభలను నిర్వహించేందుకు అందరూ కలిసి రావాలని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బ్రౌన్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం మహాసభల సన్నాహక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 8, 9వ తేదీలలో ఈ సభలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. సభలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగార్జునరెడ్డి, పూర్వ అధికార భాషా సంఘం అధ్యక్షుడు మండలి బుద్ధ ప్రసాద్‌ను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. సభల్లో రాయలసీమ సాహిత్య అధ్యయనంపై సదస్సులు, కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జింకా సుబ్రహ్మణ్యం, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, పాదిలి నాగరాజు, భూమిరెడ్డి స్వరూపరాణి, రెడ్డి శేఖర్ రెడ్డి, జీవీ.సాయిప్రసాద్, వెల్లాల వెంకటేశ్వరాచారి, తవ్వా వెంకటయ్య, అనుగూరు చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దిరెడ్డి నీలవేణి, తదితరులు పాల్గొన్నారు.

భౌతిక వనరుల వినియోగంపై అవగాహన



విద్యార్థులు, తల్లిదండ్రులతో నిర్వాహకులు

కడప కల్చరల్: భౌతిక వనరుల వినియోగం తగ్గించేందుకు కృషి చేయాలని పర్యావరణ మిత్ర సమూహం ప్రతినిధులు భరత్ కుమార్ పుష్పరాజ్, శివ భాస్కర్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, పచ్చదనం అభివృద్ధి, మానవ వనరుల సద్వినియోగం, భౌతిక వనరుల వినియోగాన్ని తగ్గించడంపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మొక్కల పెంపకం పట్ల అభిరుచి పెంచడానికి, వాటి ద్వారా విజ్ఞానం పెంచుకొని ఆనందం, ఆరోగ్యం పొందడానికి కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మొక్కల పెంపకానికి అనువైన విత్తన ప్యాకెట్లను సీడ్స్ కిట్ ఫర్ కిడ్స్ పేరిట అందజేశారు. ఈ కార్యక్రమంలో షకీల, గోవింద్ రెడ్డి, సుష్మారెడ్డి, కిరణ్, అలేఖ్య, సుప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో పూర్వ విద్యార్థులు, సిబ్బంది

చింతకొమ్మదిన్నె : కడప – రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్)లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల స్థాపించి 14 సంవత్సరాలు పూర్తయిందని, కళాశాలలో విద్యను పూర్తి చేసుకుని వివిధ రంగాల్లో స్థిరపడిన విద్యార్థులందరూ ఇలా సమావేశం కావడం మంచి పరిణామన్నారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన ఆధ్యాపకులను ఆహ్వానించి సన్మానించారు. చదువు అనంతరం వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వాళ్లందరూ వచ్చి ఒకరికొకరు కలుసుకుని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. ఈ సమావేశంలో కో ఆర్డినేటర్ డాక్టర్ కే.వి.నాగేశ్వరరెడ్డి, కళాశాలకు చెందిన వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం కరపత్రాల ఆవిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడ లైలా గ్రీన్ మెడోస్ వద్ద 2025 జనవరి, 5న నిర్వహించే హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని వీహెచ్‌పీ జిల్లా కన్వీనర్ మల్లిఖార్జునరావు కోరారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో హైందవ శంఖారావం ఛలో విజయవాడ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో పనిచేస్తున్న అన్యమతస్తులను తొలగించాలని, పూజా కైంకర్యాల్లో, ప్రసాదాల్లో నాణ్యత పాటించాలని కోరారు. దేవాలయ ట్రస్టులలో రాజకీయ ప్రమేయం లేకుండా హిందూ భక్తులతో నిర్వహించాలని, పరిసరాల్లో దుకాణాలను హిందువులకే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

కూరగాయల సాగుతో లాభాలు



పిడుగుపల్లె వద్ద సాగు చేసిన టమోటా పంట

కలసపాడు : కూరగాయల సాగుకు శీతాకాలం కూడా అనుకూలంగా ఉంటుందని, అధిక ఆదాయాన్ని ఇచ్చే పంటలు కూడా అనేకం ఉన్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ముఖ్యంగా దుంప కూరలు, క్యాబేజీ, కాలీఫ్లవర్‌తో పాటు ఏడాదంతా వచ్చే టమోటా, మిరప, వంగ పంటలు ఈ సీజన్‌లో సాగు చేయవచ్చని ఉద్యాన నిపుణులు సూచిస్తున్నారు. ఖరీఫ్ పంటలతో పోలిస్తే రబీలో దిగుబడులు ఎక్కువగానే ఉంటాయని అంటున్నారు. రబీలో కూరగాయల సాగులో నాణ్యమైన దిగుబడులు తద్వారా అధిక నికర ఆదాయం పొందాలంటే రైతులు కొన్ని మెలకువలు పాటించాలి. నీటి సౌకర్యం ఉంటేనే సాగుకు సిద్ధం కావాలి. చీడపీడలను తట్టుకుని దిగుబడిని ఇచ్చే రకాలను ఎంచుకోవాలి. ఆయా ప్రాంతాల్లో సిఫార్సు చేసిన వంగడాలనే వాడాలి. రబీలో చలి ఉండడంతో సూక్ష్మధాతు పోషకాలు లోపించే అవకాశాలు ఎక్కువ. సూక్ష్మధాతు ఎరువులను సిద్ధం చేసుకోవాలి.

హైబ్రిడ్ విత్తనాలతో దిగుబడులు

కూరగాయల సాగులో హైబ్రిడ్ విత్తనాల వలన దిగుబడులు పెరుగుతాయి. అందువల్ల హైబ్రిడ్ విత్తనాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. అయితే నాణ్యత లేని విత్తనాలు మార్కెట్‌లో ఉండే అవకాశం ఉంది. కాబట్టి విత్తనాలు కొనేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. విత్తన సంచిపై లేబిల్‌లో ఉన్న ప్రమాణాలు, మొలక శాతం, వెన్ను స్వచ్ఛత, భౌతిక స్వచ్ఛత ఇతర పదార్థాల వివరాలు పరీక్షించుకుంటే మంచిది.

నారు పెంపకం

విత్తన మొలక శాతం పరీక్షించిన తర్వాతే నారు మడులు పెంచుకోవాలి. గింజలను పేపర్‌లో వరుసగా ఒకదాని పక్కన మరొకటి పెట్టి పేపర్ చుట్టాలి. చీకట్లో ఉంచి ఉదయం, సాయంత్రం పూట నీరుతో తడి చేయాలి. వంగ, టమోటా విత్తనాలు 5 నుంచి 6 రోజులు, మిరప 10 నుంచి 11 రోజుల్లో మొలకెత్తుతాయి. ఆ తర్వాత ఎన్ని మొలకెత్తితే అంత శాతంగా నిర్ధారించుకోవాలి.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరం



రైతులు కూరగాయలు పండించడానికి శీతాకాలం అనువుగా ఉంటుంది. కాకపోతే కూరగాయల విత్తనాలను విత్తన సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. నాసిరకం విత్తనాలతో డబ్బు, శ్రమ వృథా అవుతాయి. ప్రభుత్వం గుర్తించిన కంపెనీ విత్తనాలనే ఉపయోగించాలి. విత్తనశుద్ధి చేయడం మరిచిపోవద్దు. విత్తన సంచిని పారవేయకుండా జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. కొనుగోలు సమయంలో విధిగా రసీదు తీసుకోవాలి. లైసెన్సు ఉన్న వారి వద్దనే కొనుగోలు చేయాలి. – శ్రీనివాసులరెడ్డి, ఉద్యానశాఖ అధికారి, పోరుమామిళ్ల

ప్రతి ఒక్కరూ భగవద్గీతను పఠించాలి



పాల్గొన్న భక్తులు



మాట్లాడుతున్న భక్తి వికాస్ స్వామి మహారాజ్

భక్తి వికాస్ స్వామి మహారాజ్

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠించాలని ఇస్కాన్ గురువు శ్రీమద్ భక్తి వికాస్ స్వామి మహారాజ్ పేర్కొన్నారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ చేస్తున్న పర్యటనలో భాగంగా ఆదివారం కొర్రపాడు రోడ్డులోని ఇస్కాన్ మందిరానికి స్వామిజీ వచ్చారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ భగవద్గీత చదవడంతో మంచి చెడు విచక్షణా జ్ఞానం తెలుస్తోందన్నారు. తాను లండన్‌లో పుట్టి 20 ఏళ్ల వయసులో హరే రామ.. హరే కృష్ణ మహా మంత్రంతో సంపూర్ణంగా కృష్ణచైతన్యాన్ని స్వీకరించడం జరిగిందన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా కులం, మతం, పేద–ధనిక అనే తారతమ్యం లేకుండా ప్రజలంతా అంతులేని శారీరక, మానసిక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. వారి జీవితాల్లో వెలుగు నింపి ప్రశాంతమైన మానవ జీవిత పరిపూర్ణత్వాన్ని తెలియచేయాలనే ఉద్దేశంతో ప్రపంచ వ్యాప్తంగా పర్యటిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. సోమవారం ఉదయం 8 గంటలకు ఇస్కాన్ మందిరం, సాయంత్రం 6 గంటలకు బొల్లవరంలోని ఆంజనేయస్వామి విగ్రహ సమీపంలో భగద్గీత ప్రవచనాలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో దీక్షా గురువు త్రిదండి సన్యాసి భక్తివికాస స్వామి, శిక్షా గురువు శ్రీమాన్ మదురేసు దాసు, ఇస్కాన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.